క్లుప్తంగా

తెనాలి పురపాలక సంఘానికి విద్యుత్ పొదుపులో అవార్డు



తెనాలిఅర్బన్: విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించిన విభాగంలో తెనాలి పురపాలక సంఘానికి రజత అవార్డు లభించింది. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అవార్డులను అందజేశారు. తెనాలి పట్టణంలో మంచినీటి సరఫరాలకు, వీధి దీపాల వాడకంలో విద్యుత్‌ను పొదుపుగా వాడటంలో మున్సిపాలిటీ ముందుండటంతో రజత అవార్డులకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. విజయవాడలో అవార్డును కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఏఈ చైతన్యలు అందుకున్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని వినతి

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో గంగాపార్వతీ ముక్తేశ్వరస్వామి, భద్రకాళి సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానం బయట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు పరిశీలించి వెంటనే తొలిగించాలని అయ్యప్ప స్వాములు, ఆలయ భక్తులు బుధవారం ఎంపీడీఓ వి.విజయలక్ష్మిని ఆమె కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ 150 మంది అయ్యప్ప స్వాములు దేవాలయంలో పీఠం పెట్టుకొని ప్రతి రోజు పూజలు, భజనలు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వారు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీ అడ్డుగా గుర్తు తెలియని వ్యక్తులు అన్యమతానికి సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. హిందూ దేవాలయాలముందు మృతుల, రాజకీయ, మరే ఇతర ఫ్లెక్సీలు చట్టప్రకారం నిషేధమన్నారు. కావున ఎటువంటి గొడవలు జరగకుండా అధికారులు వెంటనే స్పందించి వెంటనే తొలగించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

తెనాలిరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పెదరావూరు గ్రామ సర్పంచి కాకి రమాదేవి సూచించారు. గుంటూరుకు చెందిన కోల్పింగ్ సంస్థ ఆధ్వర్యంలో పెదరావూరులో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని సర్పంచ్ రమాదేవి ప్రారంభించి మాట్లాడుతూ భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. శ్రీనివాస్, పిల్లి అన్నమ్మ, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద వ్యక్తి మృతి చెంది ఉన్నాడని వచ్చిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు బుధవారం తెలిపారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్



ఉడా కాలనీలో జరిగిన క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్



వేడుకల్లో పాల్గొన్న ఈఈ చిరంజీవి, డీఈ అశోక్ కుమార్, పాస్టర్ రాజు

తెనాలిఅర్బన్: క్రీస్తు మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైకుంఠపురంలోని కరుణమాయ ప్రార్థన మందిరంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు పుట్టుకలో అంతర్యాన్ని అందరు గ్రహించాలన్నారు. ప్రపంచంలోని క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకొంటారని చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్‌చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే చిన్నారులు క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, నాయకులు బూరెల దుర్గ, అక్కిదాసు కిరణ్ కుమార్, కఠారి హరీష్, గద్దం సాధుథామస్ జూనియర్, పాస్టర్ గద్దం జాన్ బాబు, గద్దం సన్నీ డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

● ఉడా కాలనీలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో మంగళవారం రాత్రి సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్నారు. కౌన్సిలర్‌లు కొమరబత్తిని జయపాల్, యాతాటి అనీల్, పాస్టర్ బండి ఐజక్ తదితరులు పాల్గొన్నారు.

● చినరావూరులోని లూథరన్ చర్చిలోని సండేస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను టీచర్‌లు పిల్లి ప్రేమ్ రాజ్ , దీనమ్మలు కట్ చేసి క్రీస్తు సందేశాన్ని అందించారు. అలాగే బైబిల్ క్విజ్, పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ డివిజన్ కార్యాలయంలో...

తెనాలిటౌన్: చెంచుపేటలోని డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను ఎగ్జిక్యూటర్ ఇంజినీర్ వి.వి.చిరంజీవి కట్ చేశారు. పాస్టర్ రాజు క్రిస్మస్ సందేశం అందించారు. డీఈఈ అశోక్‌కుమార్, ఏఈ ఇస్మాయిల్ బేగ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర గుప్తా భాగవతులకు ఘననివాళి

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని గుప్తా డిగ్రీ కాలేజ్‌లో బుధవారం విద్యాదానకర్త, కళానిధి తెల్లాకుల వెంకటేశ్వర గుప్తా భాగవతుల జయంతిని జరిపారు. గుప్తా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. గుప్తా శిష్యబృందం ఆధ్వర్యంలో దీప ప్రజ్వలన చేశారు. అనంతరం ఆంజనేయం ధ్యానయోగమండలి వ్యవస్థాపకుడు కిషోర్‌గురూజీ ప్రవచనం చేశారు. దేశ విదేశాల్లో హరికథా గానంతో వెంకటేశ్వరగుప్తా పేరుప్రఖ్యాతులు సాధించారని తెలిపారు. కళాకారులను ఘనంగా సత్కరించారు. హరికథా కళాకారుల సంక్షేమ సంఘం తరుపున భాగవతారిణిలు, నాగమణి, వేములవాడ సత్యవతి, శివపార్వతి, శిష్యబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక
- తెనాలి 11, 39 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



39వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరిస్తున్న ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 11వ వార్డులోని సచివాలయం వద్ద బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కఠారి రత్న కుమారి మాట్లాడుతూ తన వార్డులో ఇప్పటి వరకు రూ.11.55 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను ఛైర్‌పర్సన్ ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు షేక్ మద్దాలి శేషాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

● 39వ వార్డు పరిధిలోని సచివాలయం వద్ద వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వద్ద బుధవారం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. 39వ వార్డులో ఇప్పటి వరకు రూ.16.59 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి ఝాన్సీవాణి తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, కౌన్సిలర్ యాతాటి అనీల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 27,40 వార్డులలో...

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 27, 40 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 27వ వార్డు మాదాల వారి వీధిలోని సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 40వ వార్డు ఐతానగర్-2 సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3గంటలకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

చెత్తను కార్మికులకు అందజేయండి

తెనాలిఅర్బన్: చెత్తను మురుగు కాల్వలో వేయకుండా కార్మికులకు అందజేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 12వ వార్డులో బుధవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్ కొర్రా యశోద, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు, సర్టిఫికెట్‌లు అందుకున్న విద్యార్థులతో కౌన్సిలర్ సురేంద్ర

తెనాలిఅర్బన్: గుజరాత్‌కు చెందిన రెయిన్‌బో ఆర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి హ్యాండ్ రైటింగ్, కలర్ పెయింటింగ్ విభాగాలలో తెనాలిలోని ఎస్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 14 మందికి బంగారు, ఐదుగురికి వెండి, ఒకరికి కాంస్య పతకాలు వచ్చాయని వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర తెలిపారు. అలాగే అమల, షేక్ సాధిక్, పి.నఫీసాలు బెస్ట్ పెర్‌ఫామెన్స్ అవార్డులకు ఎంపికైనట్లు చెప్పారు. వీరికి సంస్థ పంపిన మెడల్స్, సర్టిఫికెట్‌లను బుధవారం అయితానగర్‌లోని పాఠశాలలో అందజేసి, అభినందించారు. హెచ్‌ఎం పి.రాజకిషోర్, ఆర్ట్ టీచర్ వెంకట్ పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ పొదుపు వారోత్సవాలు

తెనాలి టౌన్: విద్యుత్ వినియోగం ఊహించని విధంగా పెరుగుతోందని, వినియోగం తగ్గించి పొదుపుగా వాడాలని తెనాలి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి అన్నారు. విద్యుత్ వారోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగిందన్నారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరుగుతోందన్నారు. విద్యుత్ పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, విద్యుత్ అధికంగా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కుష్టు, బోద వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు



పాదరక్షలు పంపిణీ చేస్తున్న వహీద్ బాషా, నాగరాజు

తెనాలిఅర్బన్: లెప్రా సొసైటీ వారి ఆధ్వర్యంలో నటరాజ్ జ్యూయలర్స్ వారి సహకారంతో బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలో కుష్టు, బోద వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లెప్రా సొసైటీ సంస్థ రాష్ట్ర సమన్వయ కర్త ఎం.రాధిక మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి నెల మూడో బుధవారం వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 25 మందికి పాదరక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు అబ్దుల్ వహీద్ బాషా, నాగరాజు, రమణ, మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

పోటీపరీక్షల్లో ఒక్క మార్కు సైతం కీలకమే



తెనాలి: పోటీపరీక్షల్లో ప్రతి ఒక్క మార్కు కూడా కీలకమేనని, భవిష్యత్‌ను అదే నిర్ణయిస్తుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్, జేవీవీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్జీఓ కల్యాణ మండపంలో గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సును నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో సబ్జెక్టులైన చరిత్ర, భూగోళశాస్త్రం, భారతీయ సమాజం, కరెంట్ అఫైర్స్, మెయిన్‌లో ఉండే ఎబిలిటీల గురించి అవగాహన కల్పించారు. గ్రూప్-2 పోస్టుల్లో 5 వేల ఖాళీలు ఉన్నందున ప్రస్తుతం భర్తీచేయనున్న 897 పోస్టుల సంఖ్యను కనీసం రెండు వేలకు పెంపుదల చేయాలని ఏపీపీఎస్సీ, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నోటిఫికేషన్ జారీలో జాప్యం నెలకొన్నందున అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచాలనీ, ప్రిలిమినరీ నుంచి మెయిన్స్‌కు తీసుకునే అభ్యర్థుల నిష్పత్తిని గత ప్రభుత్వంలో తగ్గించి, ఏపీపీఎస్సీని భ్రష్టుపట్టించారని చెబుతూ గతంలోలా ఈ నిష్పత్తిని 1:50కి మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. పరీక్షల్లో నెగ్గాలంటే సిలబస్ ఆధారంగా ప్రభుత్వం ముద్రించే పాఠ్యపుస్తకాలను కచ్చితంగా చదవాలని సలహానిచ్చారు. ప్రిలిమినరీలో 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయని, నెగటివ్ మార్కులు కూడా ఉన్నందున ప్రశ్నలు అర్థంచేసుకుని సమాధానాలు రాయాలని చెప్పారు. కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ మాదాల క్యూరీ, వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, యూటీ ఎఫ్ రాష్ట్ర నాయకులు టి.నాగమల్లేశ్వరరావు, షేక్ అహ్మద్‌హుస్సేన్, కాటుపల్లి సాంబశివరావు, ఎన్జీఓ నాయకులు బేతాల కృష్ణమోహన్, హెచ్‌ఎం ఏడుకొండలు, గుత్తా వెంకటరత్నం పాల్గొన్నారు. హెచ్‌ఎం కుర్రా శ్రీనివాసరావు స్వాగతం పలికారు. హాజరైన అభ్యర్థులకు 120 పేజీల పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు.